క్లుప్తంగా

విద్యార్థుల రక్తదానం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అనిల్‌కుమార్, వీరేంద్ర బాబు శనివారం రక్తదానం చేశారని ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ తెలిపారు. ఆమె మాట్లాడుతూ పట్టణానికి చెందిన శ్రీనివాసులు భార్య లక్ష్మీదేవికి రక్తం తక్కువగా ఉన్నందున వైద్యులు రక్తం అవసరమని చెప్పడంతో విద్యార్థులను సంప్రదించారు. వెంటనే స్పందించి విజయా బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. అధ్యాపకుడు శ్రీనివాసులు ఉన్నారు.

ఆయుధాలు డిపాజిట్

శిరివెళ్ల: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 40 మంది వద్ద ఉన్న లైసెన్స్‌డ్ ఆయుధాలను డిపాజిట్ చేసుకున్నామని ఎస్‌ఐ చంద్రబాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ శిరివెళ్ల స్టేషన్ పరిధిలో 14, రుద్రవరంలో 26 తుపాకులు, పిస్టోళ్లు డిపాజిట్ అయ్యాయన్నారు. అలాగే శిరివెళ్ల పరిధిలో 122 మంది, రుద్రవరంలో 332 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. ఇంత వరకు 3.150 కిలోల వెండి, రూ.4.10 లక్షల నగదును పట్టుకున్నామన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి రూ. 50 వేలకు మించి నగదు బహిరంగంగా తన వద్ద పెట్టుకోవద్దని సూచించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



సుద్దమల్ల శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

ఉయ్యాలవాడ : మండలంలోని సుద్దమల్ల, ఇంజేడు, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరి స్వామి, శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి, శ్రీ అభయాంజనేయస్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజలు చేశారు.అర్చకులు కమలేష్‌శర్మ, అనంతయ్య, లక్ష్మణస్వామి, భాస్కరశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఫైర్ సిబ్బంది రక్తదానం



రక్తదానం చేసిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందించిన జయన్న

బొమ్మలసత్రం: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఫైర్ స్టేషన్‌లో జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి యోగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరం కార్యక్రమానికి యువకుల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా అగ్నిమాపక అధికారి జయన్న, సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రసాదరావు హాజరయ్యారు. యోగేశ్వరరెడ్డి రక్తదానం చేసి సిబ్బందిలో ఉత్సాహం నింపారు.మొత్తం వంద మంది రక్తదానం చేశారు. మెడికల్ ఆఫీసర్ లింగేశ్వరరావు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

కేసుల సత్వర పరిష్కారం కోసమే లోక్ అదాలత్



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ

ఆళ్లగడ్డ: కేసుల సత్వర పరిష్కారమే లోక్ అదాలత్ ముఖ్య ఉద్దేశమని ఆళ్లగడ్డ 5వ అదనపు జిల్లా జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ తెలిపారు. మే 15వ తేదీన నిర్వహించనున్న మెగా లోక్ అదాలత్ సందర్భంగా శనివారం స్థానిక కోర్టు హాలులో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. డీఎస్పీ షర్ఫుద్దీన్, సీఐలు రమేష్‌బాబు, హనుమంతనాయక్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని నాగులకుంట రోడ్డులో అసద్‌మౌదూది ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. జమాతే ఇస్లామి హింద్ అధ్యక్షుడు అబ్దుల్‌సమ్మద్ మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో చిరువ్యాపారులు, ఆటో డ్రైవర్లు, పాదాచారులకు చల్లటి మినరల్ వాటర్‌ను అందజేయడం అభినందనీయమన్నారు. ఫజులేహక్, అబ్దుల్‌హలీం ఉన్నారు.

నేడు 'మోడల్' ప్రవేశ పరీక్ష

గోస్పాడు: మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతి ప్రవేశం కోసం ఆదివారం పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఖాజా హుసేన్ శనివారం తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి ప్రవేశ కోసం నిర్వహిస్తున్న పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందన్నారు. గోస్పాడు మోడల్ స్కూల్‌కు 169 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. హాల్ టికెట్‌తో ఉదయం 9 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

రాజకీయాలకు అతీతంగా పథకాల వర్తింపు



ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సెంట్రల్): రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 40వ వార్డు పప్పులబట్టి వీధిలో ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ స్థానిక కౌన్సిలర్ గంగిశెట్టి శ్రీధర్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన నంద్యాల నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే అభివృద్ధికి చిరునామాగా మారిందని చెప్పారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారాన్ని అడ్డుపెట్టుకొని కమీషన్ల కోసం పాకులాగడం తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. 21 సంవత్సరాలు పదవులు వెలగబెట్టిన ఫరూక్ నంద్యాలకు ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, వైస్ చైర్మన్ పాం షావలి, బెస్త సంఘం రాష్ట్ర డైరెక్టర్ చంద్రశేఖర్, ఏపీ ఎస్సీడీసీఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి, నంద్యాల పట్టణ అధ్యక్షులు జాకీర్ హుసేన్, పున్నా శేషయ్య, జేసీఎస్ కన్వీనర్లు దాల్‌మిల్ అమీర్, సలాముల్లా, రత్నబాబు చౌదరి, లక్ష్మీదేవి, నాగమణి భాయ్, నాగరాజు, అడ్డగళ్ల మల్లికార్జున, రసూల్ ,చిత్తలూరి రామచంద్రయ్య, తిరువీధి సురేష్, పతంగి హరి, జి.గోవిందు, దుర్గ పాల్గొన్నారు.

జగన్ పాలనలోనే అభివృద్ధి

గోస్పాడు: అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే జరుగుతున్నాయని నంద్యాల ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. మండలంలోని జూలేపల్లి, ఎం.చింతకుంట్ల గ్రామాల్లో శనివారం సాయంత్రం రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ తిరిగి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ నుంచి పోటీ చేస్తున్న నాయకులు గతంలో ప్రజలకు ఎలాంటి పనులు చేయలేదు కావున.. ఓటు అడిగేందుకు కూడా ధైర్యం లేకుండా పోయిందన్నారు. తాము గత ఎన్నికల్లో గెలిచిన నాటి నుంచి ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేశామని చెప్పారు. మరోసారి తమను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ సోషల్ మీడియా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, ఎంపీపీ ఆర్థర్ సైమాన్, సర్పంచ్‌లు పుల్లయ్య, మల్లేశ్వరమ్మ, ఎంపీటీసీలు సుబ్రహ్మణ్యం, మహేశ్వరమ్మ, నాయకులు కాంతారెడ్డి, రాజారెడ్డి, భాస్కర్ రెడ్డి, నాగేశ్వరరెడ్డి, ఆర్‌వీ సుబ్బారెడ్డి, వంగూరి రామనాథ రెడ్డి పాల్గొన్నారు.



ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి



చిరువ్యాపారులను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

చంద్రబాబు మాయమాటలు నమ్మొద్దు

ఆళ్లగడ్డ: 2014 ఎన్నికల్లో 660 హామీలు ఇచ్చి అందులో 6 హామీలు కూడా అమలు చేయని చంద్రబాబు ఇప్పుడు మళ్లీ అలవికాని హామీలతో మాయ చేసేందుకు వస్తున్నారని ఆయన మాటలు నమ్మొద్దని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని గంగమ్మ దేవాలయం, మెయిన్ బజార్, సత్రం వీధుల్లో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకందరికీ సంక్షేమ పథకాలు అందాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్‌రసూల్, శీలం సురేంద్రారెడ్డి, సింగం వెంకటేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సునీల్ ఉన్నారు.

సంక్షేమాభివృద్ధిని గెలిపించండి



బుర్రారెడ్డిపల్లెలో ప్రచారం చేస్తున్న అవంతికారెడ్డి

దొర్నిపాడు: ఐదేళ్లుగా నిరంతరం ప్రజాసంక్షేమాభివృద్ధే లక్ష్యంగా పాలన సాగించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించాలని గంగుల అవంతికారెడ్డి ఓటర్లను కోరారు. శనివారం మండలంలోని బుర్రారెడ్డిపల్లె, రామచంద్రాపురం గ్రామాల్లో ఇంటింటా తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జగనన్నను సీఎం చేసుకుంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మా తమ్ముడు గంగుల బిజేంద్రారెడ్డిని మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ శకుంతల, సొసైటీ ప్రెసిడెంట్ భూమా చెంచిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ప్రెసిడెంట్ బత్తుల నాగేశ్వరరావు కొండాపురం సర్పంచ్ మాధవీలత, మాజీ సర్పంచ్ తలారి చౌడయ్య, తలారి ప్రసాద్, రమణారెడ్డి, దొనపూడి దయానందరావు, వెంకటరామిరెడ్డి, సుబ్బారెడ్డి, మాధవీలత, నాయకులు శ్రీపతి ప్రసాద్, గొలుసుల శ్రీరాములు, చాకలి సుబ్బయ్య, సాలె రమణ, ఉచ్చుబాయిగారి వాహబ్‌బాషా, బోయ బాలు ఉశేని, మధు, మాబాషా, అల్లా మహమ్మద్, చంద్రశేఖర్, సుబ్బయ్య, మనోహర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, లక్ష్మికాంత్ రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, భూమా శ్రీనివాసరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, పల్లె శివశంకర్‌రెడ్డి, బాషా, పుల్లారెడ్డి, డీలర్ శివుడు, జేసీఎస్ కన్వీనర్ పుల్లారెడ్డి, బత్తుల క్రిష్ణయ్య, శ్రీను, బత్తుల నాగరాజు, విజయ్, పాదం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే నాయకుడు జగన్



గంగుల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన ముత్యాలపాడు టీడీపీ నాయకులు

చాగలమర్రి: అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజాసంక్షమాన్ని కాంక్షిస్తూ వివిధ రకాల సంక్షేమ పథకాలు అమలు చేసి పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని, మళ్లీ ఆయనను సీఎంగా గెలిపించుకుందామని జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి కోరారు. శనివారం మండలంలోని ముత్యాలపాడు, చక్రవర్తులపల్లె, ఎం.తండా, తోడేండ్లపల్లె, డి.వనిపెంట, డి.కొత్తపల్లె, గొడిగనూరు, శెట్టివీడు, జ్ఞానాపురం, కేపీ తండా, మూడురాళ్ళపల్లె, చింతలచెరువు, పెద్దవంగలి, చిన్నవంగలి తదితర గ్రామాల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలకు ప్రజలకు మేలు చేకూర్చారని దీంతో జనం సంతోషంగా ఉన్నారన్నారు. ఈ సంతోషాన్ని కొనసాగించుకోవాలంటే మే13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలని, వేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, ఎంపీపీ వీరభద్రుడు, సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషు రమేష్, సర్పంచ్‌లు గోవిందయ్య, బాలీశ్వరరెడ్డి, శ్రీలక్ష్మీబాయి, చీపాటి సంజీవరాయుడు, మౌలి బాషా, దద్దనాల మాబుషరీఫ్, ఉప సర్పంచ్‌లు ఓబులేసు, జబ్బార్, ఎంపీటీసీలు పత్తి నారాయణ, లక్ష్మీరెడ్డి, ఎద్దుల రాజేశ్వరి, చాంద్‌బాషా, రహీమాన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రామగురివ్రెడ్డి, యర్రం పుల్లయ్య, రామకృష్ణారెడ్డి, సుబ్బయ్య, గణపతిరెడ్డి, పగిడాల బాబు,హనుమంతరెడ్డి, శ్రీధర్, బికారిసాహెబ్, సంజీవరాయుడు, వెంకటేశ్వరరెడ్డి, మనోహర్‌రెడ్డి, రామ్లా నాయక్, సుదర్శన్‌రెడ్డి, ఎద్దుల లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక..

ముత్యాలపాడు గ్రామానికి చెందిన కొందరు భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం టీడీపీలో చేరారు. అయితే వారందరూ శనివారం మళ్లీ గంగుల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో జమ్ములదిన్నె ఓబులేసు, జమ్ములదిన్నె తిరుపాలు, బేతంపాలు, భూపనపాటి నరసింహుడు మాట్లాడుతూ.. స్థానిక టీడీపీ నాయకుడు మాజీ ఎంపీపీ తమను బలవంతంగా ఆ పార్టీలో చేర్పించారని, మాకు జగనన్నపై ఉన్న నమ్మకంతో తిరిగొచ్చామని చెప్పారు.

నివాళి

చాగలమర్రి: స్థానిక బస్టాండ్ సమీపంలో నివాసం ఉంటున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు నీరుకట్టు దస్తగిర్‌సాబ్ (65) శనివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గంగుల ప్రభాకర్ రెడ్డి చాగలమర్రికి చేరుకోని ఆయన మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు.

విశ్వసనీయతకు మద్దతివ్వండి



శ్రీరంగాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న గంగుల సారికారెడ్డి

రుద్రవరం: గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక నెరవేర్చి విశ్వసనీయతకు మరోరూపంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిలిచారని, మళ్లీ మనమంతా ఆయనకు మద్దతుగా నిలవాల్సిన సమయం ఆసన్నమైందని గంగుల సారికారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని శ్రీరంగాపురం,డి.కొట్టాల,టి.కొట్టాల గ్రామాల్లో ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డితో కలిసి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మే13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యేగా గంగుల బిజేంద్రారెడ్డి, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రజలకు చేసిన మేలును వివరించారు. మండల కో ఆప్షన్ సభ్యుడు మదార్ సాహెబ్,నాయకులు మధు,పుల్లారెడ్డి,జల్లి రమణ, దాసరి శీను,సర్పంచులు వెంకటేష్,నరసింహారెడ్డి, లక్ష్మన్న, చాకలి నాగార్జున,ఈశ్వరెడ్డి, ఇల్లూరు వెంకటరెడ్డి,పెద్దపల్లె రామిరెడ్డి,కుందూరు జయప్రతాప్‌రెడ్డి,దేరంగు నరసింహ ఉన్నారు.

టీడీపీ నాయకులవి మోసపూరిత మాటలు



ఎమ్మెల్యే శిల్పా రవి సమక్షంలో పార్టీలో చేరిన భరతం చంద్రుడు

నంద్యాల(వ్యవసాయం): టీడీపీ నాయకులు బలవంతంగా పార్టీలో చేర్చుకుంటారు కానీ.. కార్యక్రమాలకు పిలువకపోవడం విడ్డూరమని రియల్ ఎస్టేట్ వ్యాపారి భరతం చంద్రుడు అన్నారు. శనివారం మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో 6వ వార్డుకు చెందిన భరతం చంద్రుడు తిరిగి వైఎస్సార్‌సీపీకిలో చేరారు. ఆయన, ఆయన అనుచరులకు మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే రవి కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. భరతం చంద్రుడు మాట్లాడుతూ కొద్దిరోజుల క్రితం వార్డు ఇన్‌చార్జ్‌గా ఇస్తామని మభ్యపెట్టి తనను పార్టీలో చేరుకుని తమను పట్టించుకోలేదని మండిపడ్డారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీనాగిరెడ్డి, కౌన్సిలర్ పురందర్, మాజీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య ఉన్నారు.

23 న ఎద్దుల బండలాగుడు పోటీలు

కొత్తపల్లి: ఈనెల 23న మండల పరిధిలోని జీ.వీరాపురం గ్రామంలో 6 పళ్ల విభాగం ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు శనివారం తెలిపారు. గ్రామంలో వెలసిన సుంకుల పరమేశ్వరి దేవి పుట్టినరోజు సందర్భంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పాల్గొనదలచినవారు 23న ఉదయం 7 గంటలలోపు ప్రవేశ రుసుము రూ.500 చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలకు వరుసగా రూ.35వేలు, రూ.25వేలు, రూ.20వేలు, రూ.15 వేలు, రూ.10వేలు, రూ.5వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు నాగిరెడ్డి 9666539279, శివారెడ్డి 9866783974, మహేష్ 8096814685, హరి ప్రసాద్ రెడ్డి 9951053466, మల్లారెడ్డి 9963019710 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన ఇమామ్‌లు



ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, శిల్పా మోహన్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన ఇమామ్‌లు

నంద్యాల(అర్బన్): మైనార్టీల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని, వైఎస్సార్ ముస్లిం మైనార్టీలకు 4శాతం రిజర్వేషన్ కల్పిస్తే ఆయన తనయుడు రిజర్వేషన్లను అమలు చేస్తూ ముస్లింల అభివృద్ధికి పాటు పడుతున్నారని మాజీ మంత్రి శిల్పామోహన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ నాయకులు జీఎంగౌస్, కౌన్సిలర్ తబ్రేజ్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు మలికిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో పట్టణ ఇమామ్‌లు శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి శిల్పా మోహన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మౌలానా అబ్దుల్‌రజాక్, ఆసీఫ్ అబ్దుల్‌రహిమాన్, ఆసీఫ్ అమరుల్లా, ఆసీఫ్ ముద్దసర్ పాల్గొన్నారు.

టీడీపీని వీడిన వంద కుటుంబాలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణం 5వ వార్డుకు చెందిన కౌన్సిలర్ ఆరిఫ్ నాయక్, పెద్దన్నల ఆధ్వర్యంలో మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి సమక్షంలో వంద కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి మోహన్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, వేయించి పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో.. సురేంద్ర, చిన్న, సురేష్, నవీన్, మహేష్, రాజ్‌కుమార్, మంజునాథ్, లక్ష్మీదేవి, ఈశ్వరయ్య తదితరులు ఉన్నారు.



మాజీ మంత్రి శిల్పామోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన 5వ వార్డు టీడీపీ వర్గీయులు

నేడు నంద్యాలకు షర్మిల రాక

నంద్యాల(అర్బన్): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఈనెల 21వ తేదీన నంద్యాల పట్టణానికి రానున్నారు. ఆదివారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. బస్సు యాత్ర ద్వారా నందికొట్కూరు నుంచి నంద్యాలకు చేరుకొని శ్రీనివాస సెంటర్ నుంచి రోడ్డుషో ద్వారా గాంధీచౌక్‌లో జరిగే బహిరంగ సభలో ఆమె పాల్గొంటారని నంద్యాల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కమిటీ అధ్యక్షుడు, ఏఐసీసీ మెంబర్ లక్ష్మీనరసింహ యాదవ్ తెలిపారు.

ఆళ్లగడ్డ అసెంబ్లీకి ఒక నామినేషన్

ఆళ్లగడ్డ: నియోజకవర్గ ఎమ్మెల్యే స్థానానికి కాంగ్రెస్ పార్టీ తరఫున చాకలి పుల్లయ్య శనివారం నామినేషన్ వేశారని ఆర్‌ఓ మల్లికార్జున రెడ్డి తెలిపారు. అన్ని డాక్యుమెంట్లు పరిశీలించి నామినేషన్ స్వీకరించినట్లు ఆయన పేర్కొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలు

మహానంది: బండిఆత్మకూరు మండలం సంతజూటూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన ఘటన శనివారం చోటు చేసుకుంది. నంద్యాల- వెలుగోడు మార్గంలో ఎదురెదురుగా బైకులు ఢీకొనడంతో ఆత్మకూరుకు చెందిన గణేష్ తీవ్రంగా గాయపడగా 108లో నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోండి

రుద్రవరం: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి ప్రజలకు సూచించారు. మండలంలోని పెద్దకంబలూరులో శనివారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎవరైనా అల్లర్లు, గొడవలకు పాల్పడి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పల్లె వాతావరణానికి భంగం కలిగించకుండా ప్రశాంతంగా జీవించాలని, పటిష్ట ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కోరారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు



రాజీనామా పత్రాలను చూపుతున్న ఆలమూరు వలంటీర్లు

రుద్రవరం: మండలంలో వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. రెండు రోజు శనివారం వివిధ గ్రామాలకు చెందిన 39 మంది వలంటీర్లు తమ రాజీనామ పత్రాలను ఎంపీడీఓ రామచంద్రకు అందజేశారు. రుద్రవరంలోని మూడు గ్రామ సచివాలయాల నుంచి ఏడుగురు, ఎర్రగుడిదిన్నె -2, నర్సాపురం-6, ఆర్.నాగులవరం-2, మందలూరు-9, ఆలమూరు-13 మొత్తం 39 మంది వలంటీర్లు రాజీనామా చేశారు.

శిరివెళ్ల: మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల వలంటీర్లు శనివారం మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ ఫణి రాజకుమారికి అందచేశారు. మండలంలో 185 మంది రాజీనామాలు చేశారు. పంచాయతీల వారీగా.. శిరివెళ్లలో 47 మంది, గోవిందపల్లె 31, యర్రగుంట్ల 35 మంది రాజీనామాలు చేశారు. కోటపాడు 18, గుంప్రమాన్‌దిన్నె ఒకరు, గుండంపాడు 9, చెన్నూరు 8, గంగవరం 8, జీనేపల్లె ముగ్గురు, మహదేవపురం 12, బోయలకుంట్ల 13 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు.

చాగలమర్రి: మండల కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న 23 మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు.తమ రాజీనామా పత్రాలను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డికి అందజేశారు.

టీడీపీ ప్రచారంలో ఆశా వర్కర్



మాజీ మంత్రి భూమా అఖిలప్రియతో ఆశా వర్కర్

శిరివెళ్ల: మండల కేంద్రం శిరివెళ్లలో ఓ ఆశా వర్కర్ టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం చర్చనీయాంశమైంది. ఈ నెల 19వ తేదీన మాజీ మంత్రి భూమా అఖిలప్రియ శిరివెళ్లలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలతో ఫొటో దిగారు. ఆ ఫోటోలో ఆశావర్కర్ రాజేశ్వరి మాజీ మంత్రి పక్కనే నిలబడి ఉంది. ఈ విషయం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో శనివారం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అధికారి (ఎంపీడీఓ) ఫణి రాజకుమారి ఆశా వర్కర్ నుంచి వివరణ తీసుకున్నారు. ఆమె మాట్లాడుతూ..తాను ఉద్దేశ పూర్వకంగా ఫొటో దిగలేదని, వారు పిలిస్తేనే వెళ్లానని సమాధానమిచ్చినట్లు తెలిసింది. ఎంపీడీఓ మాట్లాడుతూ విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు పంపుతామని చెప్పారు.